దుర్గంధంలో రైల్వేస్టేషన్ పరిసరాలు

- యథేచ్ఛగా బహిరంగ మూత్రవిసర్జనలు
- స్టేషన్‌కి రావాలంటే ముక్కు మూసుకోవాల్సిందే
- కనిపించని టాయిలెట్‌ల సూచిక బోర్డులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ అనుకూల పద్ధతుల వినియోగంలో జాతీయస్థాయిలో అనేక అవార్డులు సొంతం చేసుకుంటున్న విజయవాడ రైల్వే డివిజన్ వాస్తవంగా స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసిన మల, మూత్ర విసర్జనలతో అధ్వానంగా ఉంటున్నా కనీసం చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. స్వచ్ఛతా హి, స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛతా పక్వాడా ఇలా అనేక పేర్లతో రైల్వే స్టేషన్‌లు, అధికారుల కార్యాలయాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం, సిబ్బందితో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం, మొక్కలు నాటి ప్రచారం చేసుకుంటున్న అధికారులు స్టేషన్ పరిసరాల ప్రాంతాల్లోని పరిశుభ్రతను మాత్రం విస్మరించారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. దుర్గంధంలో స్టేషన్ పరిసరాలు ఉన్నాయి.

లక్షలాది మంది రాకపోకలు...

విజయవాడ రైల్వే స్టేషన్‌లోకి నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యం కలిగిన స్టేషన్‌లోకి అడుగు పెట్టాలంటే ముందుగా ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధాన్ని దాటుకుని రావాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. స్టేషన్ ఎదుట పార్కింగ్ ప్రదేశం, రైల్వే ఎస్పీ కార్యాలయం రోడ్డు, ఆల్పా హోటల్ రోడ్డు, రైల్వే హాస్పటల్ రోడ్డు, రైల్వే స్టేడియం ప్రాంతాల్లో బహిరంగ మూత్ర విసర్జనలతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. పారిశుద్ధ్య అధికారులు మాత్రం ప్రతిరోజు ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి సరిపెడుతున్నారే గానీ సమస్య పరిష్కారానికి చర్యలు మాత్రం చేపట్టడం లేదు.


మూత్ర విసర్జనలతో అపరిశుభ్రంగా రైల్వే ఎస్పీ కార్యాలయం రోడ్డు


స్టేషన్ ఎదుట పార్కింగ్ సమీపంలో అపరిశుభ్రత

కనిపించని టాయిలెట్ సూచికల బోర్డులు....

నిత్యం రద్దీగా ఉండే విజయవాడ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో స్టేడియం వద్ద ఒకటి, కరుణా హోటల్ సెంటర్‌లో ఒక టాయిలెట్‌లు ఏర్పాటు చేశారు. కానీ అవి ఎక్కడ ఉన్నాయో తెలియజేసేలా ఎటువంటి సూచికల బోర్డులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితిలో ప్రయాణికులు, స్థానికులు బహిరంగ మూత్ర విసర్జనలు చేస్తున్నారు. ప్రతి రోజు దుర్గంద మధ్యే విధులకు హాజరయ్యే రైల్వే అధికారులకు విషయం తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్న విజయవాడ స్టేషన్‌లోకి వచ్చే ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావారణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గతంలో అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు



రైల్వే స్టేషన్ పరిసరాల్లో బహిరంగ మూత్ర విసర్జనలతో దేశం నలుమూలల నుంచి వచ్చే ప్రయాణికులతో విజయవాడ స్టేషన్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుంది. దీనిపై గతంలో అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికి సమస్యకు పరిష్కారం చేపట్టకపోవడం దురదృష్టకరం. టాయిలెట్‌లు ఎక్కడ ఉన్నాయో తెలిసేలా సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలి.

– వసంతరావు, బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు

వైఎస్ జగన్‌ను కలిసిన తలశిల



లండన్ పర్యటన ముగించుకుని బెంగళూరు చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ తలశిల రఘురాంతోపాటు పలువురు నేతలు స్వాగతం పలికారు. – గాంధీనగర్

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సౌమ్య థియేటర్ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వెలంపల్లి శ్రీనివాసరావుకు కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందచేసిన అనంతరం ఆలయ కమిటీ ప్రసాదాలు అందచేశారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, ఉదయం గణపతి పూజ, చతుర్దశ కలశస్థాపన, అభిషేకాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి భక్తులకు రజిత కవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మండపారాధన, గణపతి హోమం, యజ్ఞముడి ధారణ, సమర్పణ, వాసవీ హోమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, అమ్మవారికి మహా నివేదన, అన్న ప్రసాద వితరణలు జరిగాయి. రాత్రి వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి 108 రకాల పుష్పాలతో విశేషంగా పుష్పార్చన చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు సామా వెంకట సత్యనారాయణ, మాజేటి ప్రభాకరరావు, పలువురు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకుంటున్న వెలంపల్లి శ్రీనివాసరావు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ మిల్క్ ప్రాజెక్ట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ కలరా హాస్పటల్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సాయిరాం థియేటర్ ఎదురు కొండ ప్రాంతం, లంబాడీపేట, ఫైర్ స్టేషన్ ఎదురు కొండ ప్రాంతం, కలరా హాస్పటల్ కొండ, ఎస్‌వీ ఫంక్షన్ హాల్ వెనకాల తదితర ప్రాంతాలలో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

4న సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వేం చేసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 4వ తేదీన విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు. కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లోని స్వామి వారి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

లడ్డూ ప్రసాదాల విక్రయం



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి లడ్డూప్రసాదాలను భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. టీటీడీ అధికారులు నగరానికి మూడు వేల లడ్డూలను కేటాయించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రసాదాన్ని కొనుగోలు చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రామాదేవి మాట్లాడుతూ ప్రసాదాల లభ్యతను బట్టి శనివారం, ఆదివారం కూడా విక్రయిస్తామని తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకుడు మురళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోమాలసేవ, తులసి అర్చన నిర్వహించారు.

లంబాడీపేట, కేఎల్‌రావు నగర్‌లో తనిఖీలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటోలు, నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి తాగే వారు, రోడ్లపై మద్యం తాగే వారి సమాచారాన్ని ఇవ్వాలని కొత్తపేట సీఐ చిన కొండలరావు సూచించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లంబాడీపేట, అడ్డరోడ్డు, సాయిరాం థియేటర్, కేఎల్‌రావునగర్, వీఎంసీ కాలనీ, కేఎల్‌రావు పార్కు ప్రాంతాల్లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా తనిఖీ నిర్వహిస్తూ, అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. కొండ ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లోకి చేరుకున్న ఆకతాయిల వివరాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కేఎల్‌రావు పార్కుకు చేరుకున్న పోలీసులు అక్కడి సిబ్బందిని ఆరా తీశారు. మహిళలు, యువతులను వేధించే వారిపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పీఎస్‌సీఎంఆర్‌లో సందడిగా ఫెట్ -2025



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫెట్ -2025 శుక్రవారం అత్యంత సందడిగా జరిగింది. కళాశాలలోని ఎంబీఏ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ విభాగాల విద్యార్థులు ఈ ఫెట్‌లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. చేతితో తయారు చేసిన క్రాఫ్టలు, తక్షణమే పెన్సిల్‌తో ఎదుటి వ్యక్తి బొమ్మ గీసి ఇచ్చే ప్రదర్శనలు, ఫవర్ డెకరేషన్ వంటి స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అలాగే రుచికరమైన తినుబండరాలతో కేక్‌లు, శీతల పానీయాలు, చాక్లెట్ స్టాల్స్ అలరించాయి. వాటితో పాటుగా ఆటలతో సాగే పలు స్టాల్స్‌తో విద్యార్థులు ఆనందంతో పాల్గొని నృత్యాలతో సందడి చేశారు. డీజే సౌండ్‌తో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత స్టాల్స్‌ను ప్రారంభించిన బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభను పదును పెట్టే కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమరేసుధీర్, సహాయ కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పతంజలిశాస్త్రి, కె.సురేష్ పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలి

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఏఐఎస్‌ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో యూజీసీ ముసాయిదాను వెనక్కు తీసుకోవాలని కోరుతూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి విద్య కాషాయీకరణ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఉన్నత విద్యను నిర్వీర్యం చేసే విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. వీసీల నియామకం, యూజీసీ నిబంధనలు మార్పు వంటివి ఇష్టారాజ్యంగా చేస్తోందన్నారు. ఫెలోషిప్పులను రద్దు చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. అనుభవం లేని వారిని, తమకు నచ్చిన వారిని వీసీలుగా నియమించి వ్యవస్థను నాశనం చేస్తున్నారని తెలిపారు. యూజీసీ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోందన్నారు. యూజీసీ చైర్మన్ జగదీష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, ఉపాధ్యక్షుడు ఎం.సాయి కుమార్, నాయకులు సాధిక్ బాబు, కార్తీక్, రంజిత్, జగదీష్, కార్తీక్, షణ్ముఖప్రియ, ప్రవల్లిక, ఖాషాయని, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఇద్దరు అధికారులకు సత్కారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు అధికారులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. దుర్గగుడి ఇంజినీరింగ్ విభాగంలో డీఈగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు, ఆలయ సూపరింటెండెంట్ అమృతరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో వెంకటేశ్వరరావు, అమృతరావును డీఈవో రత్నరాజు సన్మానించారు. దేవస్థానంలో 30 ఏళ్లకు పైగా సర్వీసు చేయడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తొలుత కుటుంబ సమేతంగా వెంకటేశ్వరరావు, అమృతరావులు అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందచేశారు. ఆలయం నుంచి నేరుగా మహా మండపానికి చేరుకున్న వారిద్దరిని అధికారులు, సిబ్బంది శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమానికి ఆలయ ఈఈ కోటేశ్వరరావు, పెనుగంచిప్రోలు దేవస్థాన ఈఈ లింగం రమాదేవి, భాస్కర్ ఆలయ ఏఈవోలు చంద్రశేఖర్, సుధారాణి, జంగం శ్రీనివాసులు, దుర్గారావులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ అండ్ టైలరింగ్, మగ్గం వర్క్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, అసిస్టెంట్ జ్యూట్ క్రాఫ్ట్ ప్రొడక్ట్ మేకర్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మెషీన్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ డిజైనింగ్, జామ్, జ్యూస్ తయారు చేయడం, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, హోమ్ క్రాఫ్ట్స్, మిర్రర్ వర్క్, భాతిక్ పెయింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్ మొదలైన కోర్సులో శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని ఆమె కోరారు.

రిటైర్డ్ పోలీసులకు సత్కారం



విజయవాడస్పోర్ట్స్: క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు సిబ్బందికి అడ్మిన్ డీసీపీ సరిత శుక్రవారం ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. సీటీఎఫ్ ఏసీపీ ఆర్.రామచంద్రరావు, మాచవరం ఏఎస్ఐ ఎం.వి.రమణ, జగ్గయ్యపేట ఏఎస్ఐ సి.హెచ్. వెంకటేశ్వరరావు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ జె.దుర్గారావు, హోం గార్డులు జి.దుర్గారావు, ఎ.రజినిలను కమిషనర్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ సునీత, హోం గార్డ్స్ ఆర్ఐలు శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, పోలీస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు మరోసారి మోసం చేశారు

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన బూటకపు వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కంటే ఎక్కువ పథకాలు అందిస్తామని ప్రజలను నమ్మబుచ్చారన్నారు. యువగళం పాదయాత్రలోగాని పలు చానళ్ల ఇంటర్వ్యూల్లో గానీ రాష్ట్ర ప్రజలందరికీ ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ఆలా చేయలేకపోతే ప్రజలు తమ కాలర్ పట్టుకునే అవకాశం కూడా కల్పిస్తున్నామని నారా లోకేష్ చెప్పారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే పులి నోటిలో తలకాయి పెట్టినట్లు ఉంటుందని రాష్ట్ర ప్రజలందరూ ఆలోచించాలని ఎన్నికల ముందే జగన్ వివరించారన్నారు. కానీ రాష్ట్ర ప్రజలు కూటమి నాయకుల మాయలో పడి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలలలో రూ 1.19 లక్షల కోట్ల రూపాయలను అప్పులు తెచ్చారని కానీ ఎక్కడా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. అమలులో ఉన్న వాటిని కూడా పూర్తిగా పక్కదోవ పట్టించారన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు పది వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి కానీ నేడు మీరు జీఓ ప్రకారం నియమించబడలేదని మీకు జీతం ఇవ్వలేమని ప్రస్తుతానికి మీరు ఉద్యోగంలో లేరని అబద్ధపు మాటలతో కూటమి ప్రభుత్వం వలంటీర్ల గొంతు కోసిందన్నారు.

ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలకు సిద్ధం

సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి సత్తిబాబు

వించిపేటట(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్న సమయంలో రాష్ట్ర పరిస్థితి బాగోలేదు.. సంక్షేమ పథకాలు అందించలేమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చావు కబురు చల్లగా చెప్పారని సీపీఎం పశ్చిమ నగక కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు విమర్శించారు. ఫిబ్రవరి 27న నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవనంలో మహాసభల పోస్టర్ అవిష్కరణ చేపట్టారు. సత్యబాబు మాట్లాడుతూ ఎన్‌డీఏలో భాగస్వామి అయిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని ధ్వజమెత్తారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం, రాష్ట్ర ప్రజల మీద రూ. 16వేల కోట్లు విద్యుత్ భారం, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపుదల తదితర ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై జరగబోయే మహా సభలలో చర్చించుకుని భవిష్యత్ ప్రణాళికలతో ప్రజా పోరాటాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి రూ. 15వేలు ఇస్తామని చెప్పి 2024–25 విద్యా సంవత్సరంలో విద్యార్థులను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఒక పక్క పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామన్న ప్రభుత్వం ఇవ్వకపోగా మరో వైపు రాష్ట్రంలోని అడవులు, ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసేందుకు వారికి ఎక్కడ కావాలంటే అక్కడ భూమి ఇచ్చేందుకు సిద్ధపడటం వంటి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పశ్చిమ నగర కార్యవర్గ సభ్యురాలు గాదే ఆదిలక్ష్మి, నాయకులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మహా సభల పోస్టర్‌ను అవిష్కరిస్తున్న సీపీఎం నేతలు సత్తిబాబు, ఆదిలక్ష్మీ

దళారీ వ్యవహారంపై మంత్రి ఆరా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని త్వరతిగతిన భక్తులకు దుర్గమ్మ దర్శనాలు కల్పిస్తున్న దళారి వ్యవహారంపై దేవదాయ శాఖ మంత్రి ఆరా తీసినట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారంలో కీలకంగా మారిన ఫోన్‌పేలోని వివరాల చిట్టా ఇప్పటికే దేవస్థాన అధికారులకు చేరింది. ఆ వివరాలను మంత్రి సైతం అడిగి తెలుసుకోవడంతో పాటు వారి డ్యూటీలను మార్చాలని సూచించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆలయ సిబ్బంది డ్యూటీలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతి మూడు నెలలకు ఒక సారి ఆలయ సిబ్బందిని అంతర్గతంగా డ్యూటీలు మార్చాలని గతంలో దేవదాయ శాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు అందాయి. అయితే సుమారుగా 8 నెలలుగా ఆలయ సిబ్బంది ఎక్కడి వారు అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల దేవస్థానంలో వరస వివాదాలు చోటు చేసుకోవడంతో ఇప్పుడు మరో మారు డ్యూటీలు మార్పులు అంశం తెరపైకి వచ్చింది. ఇదే వారంలో టిడ్కో చైర్మన్‌కు హారతుల సమయంలో ప్రోటోకాల్ పాటించకపోవడం, తాజాగా దర్శనాలు కల్పిస్తున్న దళారులపై వ్యవహారం వెలుగులోకి రావడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తుంది. మరో వైపున ఫోన్‌పేలో ఉన్న ఆలయ సిబ్బందిపై విచారణ జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దేవస్థానానికి చెందిన కీలక అధికారి వద్దకు ఆలయ సిబ్బంది పేర్లు, వారికి పంపిన మొత్తం వివరాలపై గుట్టుగా విచారణ జరుగుతుంది. అయితే ఈ పేర్లు బయటకు రాకుండా తన వంతుగా మీకు భరోసా ఇస్తున్నానని ఈ అధికారి పేర్కొనట్లు దేవస్థానంలో ప్రచారం నడుస్తోంది. ఈ వ్యవహారం ఇక్కడితో ముగించేందుకు పెద్ద మొత్తంలో చేతులు మారేందుకు రంగం సిద్ధమైందని ఆలయ సిబ్బంది బహిరంగంగా పేర్కొంటున్నారు.

7 నుంచి హాస్య నాటికల పోటీలు

విజయవాడ కల్చరల్: సుమధుర కళానికేతన్ 51వ వార్షికోత్సవం, 27వ హాస్యనాటికల పోటీకి ప్రదర్శించే హాస్యనాటికల వివరాలను సుమధర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి పసుమర్తి భాస్కరశర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి పిండిప్రోలు సూర్యనారాయణమూర్తి వెల్లడించారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భాస్కరశర్మ మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో వీడేం మగాడండీ బాబు (కళాంజలి సంస్థ హైదరాబాద్), వర్క్ ఫ్రం హోమ్(సహృదయ ద్రోణాదుల), దంత వేదాంతం (ఈవీఎస్ కళాసమితి విజయవాడ), మా ఇంట్లో మహాభారతం (మద్దుకూరి క్రియేషన్స్ చిలకలూరిపేట), దొందూ దొందే (భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం), ప్రేమ పిచ్చి (యంగ్ థియేటర్స్ విజయవాడ), ఆవేశంలో ఆనందం (మల్లాది క్రియేషన్స్, హైదరాబాద్) వారి నాటికలను ప్రదర్శనలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. పిండిప్రోలు సూర్యనారాయణ మాట్లాడుతూ యువ కళాకారులను ప్రోత్సహిస్తూ సిద్దార్థ విద్యాసంస్థల విద్యార్థులు లఘునాటికలు, సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.


నాటికల వివరాలు వెల్లడిస్తున్న భాస్కరశర్మ

వైభవంగా వాసవీ ఆత్మార్పణ పర్వదినం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ పర్వదిన మహోత్సవం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ ప్రార్థన మందిరంలో అమ్మవారికి స్వర్ణ కిరీటాన్ని ధరింపజేశారు. వందలాది మహిళలతో సామూహిక కుంకుమార్చనలు చేశారు. శాంతి హోమం నిర్వహించి ఆత్మర్పణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్తగుళ్ళు ప్రాంగణంలోని వాసవీ అమ్మవారి ఆలయంలో కమిటీ సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, యువజన సంఘం అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాసవీ సేవాదళ్, శ్రీ వాసవీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ పర్వదిన మహోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. కృష్ణానది నుంచి పవిత్ర నదీజాలాలను ఊరేగింపుగా తీసుకొచ్చి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని అభిషేకించారు. పాతబస్తీ లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కల్యాణమండపంలో జరిగిన ఈ మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. వందలాది మంది మహిళలతో శ్రీ లలితా సహస్రనామా సహిత కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీవాసవీ హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ సంస్థల ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ వేముల హజరత్తయ్యగుప్తా పాల్గొన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహరావు పర్యవేక్షించగా మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు నాయకులు నంబూరి ప్రదీప్, కొనిజేటి రమేష్, కే సతీష్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తగుళ్ళు ప్రాంగణంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న వెలంపల్లి